సాక్షి జగిత్యాల

సోమవారం ׀ 17 ׀ ఏప్రిల్ ׀ 2023



నృసింహునికి పూజలు

ధర్మపురి: అదనపు కలెక్టర్ మకరంద్ దంపతులు ఆదివారం ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకున్నారు.




రాజన్నకు మొక్కులు

వేములవాడ: రాజన్నను ఆదివారం సుమారు 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. తమను సల్లంగా చూడాలని మొక్కుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.0/26.0

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటిపూట ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది.



న్యూస్‌రీల్

రైతు వెంకటేశ్‌కు అభినందన




కలెక్టర్‌కు కర్బూజ అందిస్తున్న రైతు వెంకటేశ్

జగిత్యాలఅగ్రికల్చర్: 'కర్బూజ(వాటర్ మిలన్, పుచ్చకాయ) సాగు విధానం ఆదర్శం కావాలి.. శెభాష్ వెంకటేశ్' అని కలెక్టర్ యాస్మిన్ బాషా రైతు బండారి వెంకటేశ్‌ను అభినందించారు. సారంగాపూర్ మండలం పెంబట్లకు చెందిన రైతు వెంకటేశ్ నాలుగైదు రకాల కర్బూజ సాగు చేశారు. వినూత్న రీతిలో తానే దిగుబడిని మార్కెట్ చేస్తున్నాడు. జిల్లాలోనే తొలిసారి వినూత్నంగా పండించిన కర్బూజలను ఆదివారం ఆయన యాస్మిన్ బాషాకు అందించాడు. కలెక్టర్ చిరునవ్వుతో రైతును అభినందించారు. కొత్త రకం పంటలు సాగు చేస్తూ ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు మెక్కోండ రాంరెడ్డి ఉన్నారు.

వేడెక్కిన భూపోరాటం

- ఇళ్ల స్థలాల కోసం పేదల పోరు
- హద్దుల ఏర్పాటు .. డేరాల నిర్మాణం
- ఆక్రమణలు చట్టవిరుద్ధమంటున్న రెవెన్యూ అధికారులు
- వారం రోజులుగా ఉద్యమం



జంబిగద్దెల స్థలం

కోరుట్ల: దసరా సందర్భంగా జంబి కొట్టే ఏరియాలోని ప్రభుత్వ స్థలం అది.. అక్కడే షమీ చెట్టు ఏర్పా టు చేస్తారు. జంబిగద్దెలను అనుకుని 52 ఎకరాలు ఉంది. దసరా సందర్భంగా ఇక్కడ ఏటా జంబి కొట్టే వేడుకలు నిర్వహిస్తారు. పట్టణవాసులు భారీ సంఖ్యలో హాజరవుతారు. అయితే, ఇది శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన స్థలమనే ప్రచారం ఉంది. ఇక్కడే పేదలకు ఇళ్లు ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో భూపోరాటం సాగుతోంది. ఓ నాయకుడిపై దాడి చేయడం, పోలీసులు కేసు నమోదు చేయడం, పోలీసుల తీరుపై ఆందోళనకారులు నిరసన తెలపడంతో పరిస్థితులు ప్రస్తుతం ఉద్రిక్తంగా మారాయి.

ప్రతిపాదనలు అనేకం..

- జంబిగద్దెల సమీపంలోని 923 సర్వే నంబరులో 52 ఎకరాల ప్రభుత్వ స్థలంలో వెటర్నరీ కళాశాలకు 40 ఎకరాలు కేటాయించేందుకు ప్రతిపాదించారు.
- అందులో వెటర్నరీ కళాశాల తరఫునన కృషి విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి సంకల్పించారు. ప్రస్తుత వెటర్నరీ కళాశాల భవన సముదాయాలకు ఈ స్థలం దూరంగా ఉండటంతో ఆ ప్రతిపాదన విరమించుకున్నారు.
- సుమారు పన్నెండేళ్ల క్రితం పేదలకు ఇక్కడే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు సన్నాహాలు చేశారు. నేల పరీక్షలు చేయగా ఆశించిన ఫలితాలు రాలేదు. దీంతో ఆ ప్రతిపాదన రద్దు చేశారు.
- ఇదే స్థలంలో పంటలు సాగు చేసుకునేందుకు సుమారు 20 ఎకరాల మేర ఎక్‌సాల్ పట్టాలు జారీచేశారు. పంటలు పండించకపోవడంతో ఆ పట్టాలు కూడా రద్దు అయ్యాయి.
- ప్రస్తుతం జంబిగద్దెల వద్ద ఉన్న 52 ఎకరాలు పరంపోగు కింద ప్రభుత్వ అధీనంలో ఉంది.
- మినీ స్టేడియంకోసం పదెకరాలు కావాలనే డిమాండ్‌తో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఇందులో కొంత ప్రతిపాదించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ క్రమంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు స్థలం చదును చేస్తున్నారు.
- ఈ క్రమంలోనే సీపీఎం నాయకులు భూపోరాటానికి జంబిగద్దెల స్థలాన్ని ఎంచుకున్నారు.
- వారం క్రితం పట్టణానికి చెందిన పేదలను సమీకరించి ముళ్లపొదలు, చెట్లు తొలగించే పనులకు శ్రీకారం చుట్టారు.
- అయితే, ప్రభుత్వ స్థలం కేటాయిస్తున్నారనే ప్రచారంతో వందలాది మంది పేదలు ఈ స్థలంలో హద్దులు ఏర్పాటు చేసుకుని, చీరలతో డేరాలు నిర్మించుకుంటున్నారు.



జంబి గద్దెల ప్రాంతంలోని ప్రభుత్వ భూమి చదును చేసి హద్దులు ఏర్పాటు చేసుకుంటున్న పేదలు

ఉద్యమం..ఉద్రిక్తం

- ప్రభుత్వ స్థలంలో హద్దుల ఏర్పాటుపై అప్రమత్తమైన రెవెన్యూ అధికారులు.. సీపీఎం నాయకుడు తిరుపతి నాయక్‌తోపాటు మరికొందరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.
- శనివారం జంబిగద్దెల స్థలంలో తమకు పట్టాలు ఉన్నాయని ఆ ఏరియాకు చెందిన ఓ టీఆర్‌ఎస్ కౌన్సిలర్ భర్త, ఆయన అనుచరుడు భూపోరాటానికి సారథ్యం వహిస్తున్న సీపీఎం నాయకుడు తిరుపతి నాయక్‌పై దాడి చేశారు. దీనిపైనా పోలీసులు కేసు నమోదు చేశారు.
- ఈ సమయంలో ఉద్యమంలో పాలుపంచుకుంటున్న మహిళలతోపాటు మరికొందరు పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చి పోలీసుల విధులకు ఆటంకం కల్పించగా ఇద్దరిపై కేసు నమోదు చేశారు.
- క్రమేపీ భూపోరాటం హింసాత్మకంగా మారి ఉద్రిక్త పరిస్థితులకు దారితీయడంలో ముస్ముందు ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయోననే ఆందోళన నెలకొంది.

స్థలాలు ఇచ్చేవరకూ ఉద్యమం



సీపీఎం పార్టీ తరఫున తీసుకున్న భూపోరాటంలో భాగంగా జంబిగద్దెల ప్రభుత్వ స్థలంలో పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించాలి. అప్పటిదాకా ఉద్యమం కొనసాగిస్తాం. పేదలకు న్యాయం జరిగేవరకు వెనకంజ వేయం. కేసులు పెట్టినా భయపడం. ప్రభుత్వం స్పందించి పట్టాలు ఇవ్వాలి.

– తిరుపతి నాయక్, సీపీఎం నాయకుడు

నిబంధనలకు విరుద్ధం

జంబిగద్దెల వద్ద 52ఎకరాల పరంపోగు ప్రభుత్వం అధీనంలో ఉంది. ఇందులో హద్దులు పాతి, డేరాలు వేయడం నిబంధనలకు విరుద్ధం. ఆక్రమణలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాం. ప్రభుత్వం ఇళ్లస్థలాలు ఇస్తుందన్న తప్పుడు ప్రచారం నమ్మవద్దు. **– రాజేశ్, తహసీల్దార్, కోరుట్ల**

నిలువ నీడ లేదు



మాకు నిలువ నీడ లేదు. ఏళ్ల తరబడి అద్దె ఇంట్లోనే ఉంటున్నం. ప్రభుత్వ స్థలం ఇస్తమని చెప్పినప్పుడల్లా దరఖాస్తు చేసుకున్నం. డబుల్ బెడ్ రూం ఇంటికోసం దరకాస్తు చేసినం. ఇండ్లు ఉన్నవారికి వచ్చినయ్. కానీ మాకు రాలే. ఇది ప్రభుత్వ స్థలమే. ఇందులో మాకు స్థలం ఇవ్వాలె.

– పోతుగంటి నాగరాణి, కోరుట్ల

సర్వే చేసి ఇవ్వండి



జంబిగద్దెల ప్రభుత్వ స్థలంలో హద్దులు వేసుకున్న వారందరూ పేదలే. కావాలంటే ప్రభుత్వమే సర్వే చేయించుకుని పేదలకు అందులో ఇళ్ల స్థలాలు ఇవ్వండి. సీపీఎం పేదల తరపున పోరాడుతుంది. వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదు. అధికారులు ఆలోచన చేయాలె. **– రజియా, కోరుట్ల**

ఆశల పల్లకీలో పేదలు

ప్రభుత్వ స్థలంలో సీపీఎం భూపోరాటం మొదలు కావడంతో స్లమ్ ఏరియాల్లోని వందలాది మంది పేదలు పలుగు, పారలతో తరలివచ్చి సంబిగద్దెల ప్రాంతంలో హద్దులు ఏర్పాటు చేసుకుంటున్నారు. పాత చీరలతో డేరాలు వేసుకోవడం మొదలెట్టారు. రెవెన్యూ, పోలీసు అధికారులు అడ్డు చెప్పినా ఎవరూ వినడంలేదు. పైగా, ప్రభుత్వం తమకు స్థలాలు కేటాయిస్తామని దశాబ్దాలుగా చెబుతూ వస్తున్నా.. కేటాయించడం లేదని, ఈ స్థలంలో పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.3 లక్షలు సాయం చేయాలని ఆందోళనకారులు మొండికేస్తున్నారు. ప్రతీరోజు రెవెన్యూ, పోలీసు అధికారులు అక్కడే మోహరించి డేరాలు తొలగిస్తే, హద్దులు చెరిపేస్తున్నా పేద మహిళలు ఆశలు వీడకుండా అక్కడే ఉండి ఉద్యమంలో పాలుపంచుకుంటున్నారు.

ఉపాధి మార్గం.. పర్యావరణ హితం

- జనుముతో అందమైన బ్యాగుల తయారీ
- మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహణ
- ప్లాస్టిక్ వస్తు, సామగ్రికి ప్రత్యామ్నాయం
- చేయూతనిస్తున్న మెప్మా అధికారులు
- మహిళా సంఘాల ఆదర్శం

కోరుట్లటౌన్: ట్రెండ్ మారుతోంది.. అందరిలో విభిన్నంగా కనిపించాలనే ఆసక్తి పెరుగుతోంది.. ఏ పని చేసినా ప్రత్యేకత చాటుకోవాలనే తపన ఆలోచనలకు పదును పెడుతోంది.. అందులో భాగమే పిల్లలకు లంచ్ బాక్స్‌లు తీసుకెళ్లేందుకు పలు డిజైన్ల జ్యూట్ బ్యాగ్‌లు వినియోగిస్తున్నారు.. కూరగాయలు తెచ్చేందుకూ పర్యావరణ రహిత సంచులు వాడుతున్నారు.. ఉద్యోగులు టిఫిన్‌బాక్స్‌లు తీసుకెళ్లేందుకు జనుము బ్యాగ్‌లు పట్టుకెళ్తున్నారు.. చివరకు శుభకార్యాల్లో గిఫ్ట్‌లు అందజేసేందుకూ జనుముతో తయారైన కవర్లు వినియోగించడం ప్రజల్లో వస్తున్న మార్పులకు అద్దంపడుతున్నాయి.. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకున్న కోరుట్లలోని కొన్ని మహిళా సంఘాలు.. జనుముతో ఆకట్టుకునే బ్యాగ్‌లు తయారు చేస్తూ స్వయం ఉపాధి పొందుతున్నాయి. పర్యావరణ పరిరక్షణలో తామూ పాలుపంచుకుంటున్నాయి.

రూ.7లక్షల రుణం..

- మున్సిపల్ పరిధిలోని మెప్మా అధికారుల చేయూతతో బ్యాంక్ లింకేజీ ద్వారా మహిళా సంఘాలకు రూ.7 లక్షలు రుణం మంజూరు చేశారు. ఇందులో ప్రధానంగా అమన్ స్వశక్తి మహిళా సంఘంలోని 10 మంది సభ్యులు మూడు ఏళ్ల క్రితం జ్యూట్ బ్యాగుల తయారీ పరిశ్రమ స్థాపించారు. ప్రస్తుతం ఏడుగురు మహిళలు పట్టుదలతో పనిచేస్తూ, జ్యూట్ బ్యాగులు తయారు చేస్తున్నారు. వారితోపాటు మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. రోజూ సుమారు వంద బ్యాగులు తయారు చేస్తున్నారు.

హైదరాబాద్ నుంచి ముడి సరుకులు..

- జ్యూట్ బ్యాగుల తయారీకి అవసరమైన ముడిసరుకులను హైదరాబాద్ నుంచి మహిళలు తెప్పించుకుంటున్నారు.
- ఇందులో జనపనార రోల్స్, జిప్‌లు, మెటీరియల్స్, ప్రింటెడ్ పేపర్ కలర్స్ ఉంటున్నాయి.
- ఇలా తీసుకొచ్చిన ముడిసరుకులతో పలువురు మహిళలు ఆకర్షణీయమైన డిజైన్లలో బ్యాగులు అందంగా తయారు చేస్తున్నారు.
- ఒక్కో సంచి నాణ్యతను, మన్నికను, డిజైన్‌ను బట్టి రూ.40 నుంచి మొదలుకుని రూ.50, రూ.100, రూ.200, రూ.300, రూ.400, రూ.500 వరకు ధర పలుకుతున్నాయి.



జ్యూట్ బ్యాగులు తయారు చేస్తున్న మహిళలు

పర్యావరణ పరిరక్షణకు కృషి



- పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు మెప్మా ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య సంఘాల సభ్యులు తమవంతు బాధ్యత తీసుకుంటున్నారు. ప్లాస్టిక్ సంచులు వాడొద్దని ప్రజలకు సూచిస్తున్నారు. జ్యూట్ బ్యాగుల ఉపయోగాల గురించి అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే 2 వేల మందికిపైగా కొనుగోలు చేశారు. ప్రణాళిక బద్ధంగా అన్ని సమాఖ్యల ద్వారా జ్యూట్ బ్యాగులు వాడకం పెరిగితే, జ్యూట్ పరిశ్రమలో మహిళలకు మరింత ఉపాధి దొరికే అవకాశాలు మెరుగవుతాయి.

ఉచితంగా కుట్టు మిషన్లు..

- పట్టణంలో అమన్ స్వశక్తి మహిళా సంఘం సభ్యులు తొలుత జ్యూట్ బ్యాగుల తయారీకి పూనుకున్నారు.
- వీరికి శిక్షణ ఇప్పించేందుకు ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సాయం చేశారు.
- పట్టణంలో ఓ షెడ్డు నిర్మింపజేశారు. ఉచితంగా కుట్ట మిషన్లు అందజేశారు.
- మైనార్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగుల తయారీ కోసం 30 మంది మహిళలు శిక్షణ తీసుకున్నారు.

ధైర్యంగా ముందుకు పోతున్నం



జ్యూట్ పరిశ్రమలో నిలదొక్కుకునేందుకు ధైర్యంగా నిలబడ్డాం. ఆసక్తితో జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ తీసుకున్నాం. ఈ పని ఎంతోఇష్టంతో చేస్తున్నాం. ఇంకో తొమ్మిదిమందితో కలిసి అమన్ స్వశక్తి సంఘం స్థాపించాం. ప్రస్తుతం ఏడుగురితో పనిచేసుకుంటూ స్వయం ఉపాధి పొందుతున్నాం. మరికొందరికి కూడా ఉపాధి కల్పిస్తున్నం. ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు.

– అఫ్రోజ అమన్, అధ్యక్షురాలు, అమన్ స్వశక్తి సంఘం, కోరుట్ల

చేయూత ఇచ్చాం



మెప్మా ఆధ్వర్యంలో కేడీసీసీబీ లింకేజీతో సుమారు రూ.7లక్షలు రుణం మంజూరు చేశాం. ఆ సొమ్ముతో మహిళా సంఘం జ్యూట్ పరిశ్రమ స్థాపించుకుంది. మహిళలు చక్కగా పనిచేస్తూ, అందమైన జ్యూట్ బ్యాగులు తయారు చేస్తున్నారు. వాటి విక్రయం ద్వారా స్వయం ఉపాధి పొందడం సంతోషంగా ఉంది.

– శివ, మెప్మా అధికారి, కోరుట్ల

ప్లాస్టిక్ రహిత పట్టణం లక్ష్యం



కోరుట్ల మున్సిపల్ ప్రాంతాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. ప్రధానంగా పట్టణవాసులు జ్యూట్ బ్యా గులు వినియోగించేలా ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నాం. మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో అందరికీ అవగాహన కల్పిస్తున్నాం.

– ఎండీ అయాజ్, మున్సిపల్ కమిషనర్, కోరుట్ల

ప్రశాంతంగా 'మోడల్' ప్రవేశ పరీక్ష

కథలాపూర్(జగిత్యాల): జిల్లాలోని మోడల్ స్కూళ్లలో ఆరు నుంచి పదో తరగతి వరకు ప్రవేశాల కోసం ఆదివారం చేపట్టిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినటు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశాలకు కథలాపూర్ మండలంలో 232 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 214 మంది హాజరయ్యారు. ఏడు నుంచి పదోతరగతి ప్రవేశాలకు 117 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 104 మంది హాజరయ్యారు. కథలాపూర్ మోడల్ స్కూల్‌లో జరిగిన ప్రవేశ పరీక్షకు ఉదయం, మధ్యాహ్నం కలిసి 31 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ తాటికొండ నరేశ్ పేర్కొన్నారు.

భోగ శ్రావణికి రాష్ట్రస్థాయి పదవి



జగిత్యాలటౌన్: మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భోగ శ్రావణికి బీజేపీలో రాష్ట్రస్థాయి పదవి లభించింది. తన పదవికి, బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వానికి గతంలోనే రాజీనామా చేసిన శ్రావణి.. ఆ తర్వాత బీజేపీలో చేరారు. ఈమేరకు ఆమెను భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా నియమిస్తూ పార్టీ వర్గాలు ఉత్తర్వులు జారీ చేశాయి. ఈసందర్భంగా శ్రావణి మాట్లాడుతూ తనపై ఎంతోనమ్మకంతో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, సహకరించిన ఎంపీ అర్వింద్, చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తం



జగిత్యాలక్రైం: అగ్నిప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన పెంచాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కొమురయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అగ్నిప్రమాదాల నివారణపై ఆదివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, అగ్నిప్రమాదాలు జరిగితే సిబ్బంది సత్వరమే స్పందించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. దీంతోపాటు తక్షణమే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇస్తే.. సకాలంలో ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదాలను నియంత్రించే అవకాశం ఉంటుందని తెలిపారు.

'ద్రోహం చేస్తే గుణపాఠం తప్పదు'



మల్లాపూర్(కోరుట్ల): రాజకీయంగా జన్మనిచ్చిన కాంగ్రెస్‌కు ద్రోహం చేస్తే ప్రజలు బుద్ధి చెబుతారని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి హెచ్చరించారు. ముత్యంపేటలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజగోపాల్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వంటి నాయకులు కాంగ్రెస్‌లో అనేక పదవులు అనుభవించి, ఇప్పుడు పార్టీకి రాజీనామా చేయడం కన్నతల్లికి ద్రోహం చేసినట్లేనని మండిపడ్డారు. మహేశ్వర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి లాంటి నాయకులు కాంట్రాక్టులు, డబ్బు సంపాదన, పదవుల కోసమే బీజేపీలో చేరుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూతన పీఆర్సీ అమలుపై కమిటీ


మాట్లాడుతున్న భూమయ్య

జగిత్యాలటౌన్: నూతన పీఆర్సీ అమలుపై కమిటీ ఏర్పాటు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాజోజి భూమయ్య కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు బైరం హరికిరణ్ అధ్యక్షతన జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. భూమయ్య మాట్లాడుతూ పాత పీఆర్సీ గడువు ఈఏడాది జూన్‌తో ముగుస్తుందన్నారు. జూలై ఒకటినుంచి కొత్త పీఆర్సీ అమలు చేయాల్సి ఉందన్నారు. అయితే, ఇప్పటివరకు కొత్త కమిటీ ఏర్పాటు చేయలేదని అన్నారు. ఉపాధ్యాయులకు 33నెలల ఎరియర్స్ రాలేదని, ప్రతినెలా వేతనాల కోసం 15వ తేదీ వరకు ఎదురుచూడాల్సి రావడం దారుణమన్నారు. సీపీఎస్ రద్దుచేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలని, ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వంగా రుజువు చేసుకోవాలని అన్నారు. వేసవి సెలవుల్లో పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మచ్చ శంకర్, మేకల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

జగిత్యాల క్రైం: మానసికస్థితి సరిగా లేని ఓ వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. జిల్లా కేంద్రంలోని లడ్డుఖాజా హోటల్ ప్రాంతానికి చెందిన గుండ జయలక్ష్మీ (70) కొన్ని రోజులుగా వయోభారంతో పాటు మానసిక స్థితి సరిగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లోంచి వెళ్లి చింతకుంట చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పట్టణ ఏఎస్సై వేణురావు గజ ఈతగాళ్లతో జయలక్ష్మీ మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి కుమారులు శ్రీనివాస్, రమేశ్, సంతోష్, కుమార్తె భూలక్ష్మి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

ధర్మపురి : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ధర్మపురికి చెందిన స్తంభంకాడి రాజేందర్ ఆదివారం పనినిమిత్తం బైక్‌పై వెళ్తుండగా స్థానిక తమ్మళకుంట వద్ద ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొన్నాడు. తీవ్రగాయాలు కాగా 108లో చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.


చికిత్స పొందుతున్న రాజేందర్

మరో ఘటనలో ఒకరికి..

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. తాళ్లధర్మారంకు చెందిన లచ్చన్న తన సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా గ్రామ శివారులోని వంతెన వద్ద ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో లచ్చన్నకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు.


గాయపడ్డ లచ్చన్న

మృత్యు శకటాలుగా టిప్పర్లు

- అతి వేగం..అజాగ్రత్తతో నడపడంతో పెరుగుతున్న ప్రమాదాలు
- దుమ్ము.. ధూళితో అనారోగ్యం బారినపడుతున్న ప్రజలు
- కొరవడిన అధికారుల తనిఖీ


ప్రమాదంలో మృతిచెందిన మల్లేశం (ఫైల్)


టిప్పర్ వేగానికి లేచిన దుమ్ము

బోయినపల్లి (చొప్పదండి): అతివేగం, అజాగ్రత్తతో రోడ్లపై మట్టి తరలించే టిప్పర్లు మృత్యుశకటాలుగా మారుతున్నాయి. మండలంలో కొన్నినెలలుగా మట్టిని తరలించేందుకు టిప్పర్లకు డిమాండ్ బాగా పెరిగింది. వీలైనన్ని ఎక్కువ ట్రిప్పులు తరలిస్తే అంత ఆదాయం అధికంగా వస్తుందనే కక్కుర్తితో టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తూ సామాన్యుల ప్రాణాలమీదకు తెస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం మండలంలోని స్తంభంపల్లి గ్రామ పరిసరాల్లో టిప్పర్ ఢీకొని గుండన్నపల్లి గ్రామానికి చెందిన మల్లేశం అనే రైతు మృతిచెందడం గ్రామంలో విషాదం నింపింది.

కొన్ని నెలలుగా పెద్దమొత్తంలో..

రియల్ వ్యాపారంతో భూములు చదును చేయడం.. నూతన ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన పనులకు మట్టి, మొరం తరలించేందుకు డిమాండ్ పెరిగింది. దీంతో ఇటీవల మండలంతో పాటు, వేములవాడ, గంగాధర తదితర పరిసరాల నుంచి టిప్పర్ల ద్వారా మట్టి, మొరం తరలిస్తున్నారు. ఈ క్రమంలో కొన్నినెలలుగా మట్టిని పెద్దమొత్తంలో తరలిస్తున్నారు. కొన్ని రోజులుగా ఓ ప్రాంతం నుంచి పెద్ద మొత్తంలో టిప్పర్ల ద్వారా మట్టి రవాణా చేస్తున్నారు. రోజుకూ దాదాపు 20 నుంచి 30 ట్రిప్పులు మట్టి, మొరాన్ని తరలించిన సందర్భాలున్నాయని పలువురు చెబుతున్నారు. ధనార్జనే ధ్యేయంగా ఇష్టారీతిగా మట్టి తరలిస్తుండగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తనిఖీలు శూన్యం

రోడ్లపై నడుస్తున్న టిప్పర్లకు ఫిట్‌నెస్, వాహన పత్రాలు, లైసెన్స్‌తోపాటు తనిఖీలు చేయాల్సిన ఆర్టీఏ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తున్నారు. మండలంలో కొన్నిరోజులుగా జరుగుతున్న మట్టి తరలింపుపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మట్టి ఎక్కడ నుంచి తీస్తున్నారు. యథేచ్ఛగా బయటకు ఎలా తరలిస్తున్నారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. కాగా ఈ విషయంలో శాఖల మధ్య సమన్వయం లేక తమ పరిధి కాదని దాటవేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బోయినపల్లి– వేములవాడ దారిలో టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారని, దీంతో విపరీతమైన దుమ్ములేస్తోందని పలువురు వాపోతున్నారు. దుమ్ము, ధూళితో అనారోగ్యం సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగకుండా చూడాలని పలువురు పేర్కొంటున్నారు.

ప్రతి ధాన్యపు గింజను కొంటాం

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అగ్రికల్చర్ : రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని చల్గల్ మార్కెట్‌యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ లతతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గతంలో పండిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు ఇతర ప్రాంతాలకు తరలిస్తే ఇప్పుడు ధాన్యాన్ని నిల్వచేసేందుకు గోదాంలు నిర్మించినట్లు తెలిపారు. మిషన్ కాకతీయతో భూగర్భజలాలు పెరగడంతో పాటు కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా రైతులకు సాగునీరందిస్తున్నట్లు చెప్పారు. ఇతర రాష్ట్రాల కూలీలు ఉపాధి కోసం తెలంగాణకు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు, సింగిల్‌విండో చైర్మన్లు మహిపాల్ రెడ్డి, సందీప్‌రావు, మార్కెట్ చైర్‌పర్సన్ నక్కల రాధ, మార్కెట్ వైస్ చైర్మన్ ఆసీఫ్, సర్పంచ్ గంగనర్సు, రైతు నాయకులు రవీందర్ రెడ్డి, బాల ముకుందం, సురేందర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పురస్కారాలు అందజేత


పురస్కారం అందుకుంటున్న శరత్‌చంద్ర

కోరుట్లటౌన్ : కోరుట్లకు చెందిన సాహితీ కవులు డా.అడువాల సుజాత, డా.తిరునగరి శరత్‌చంద్రకు అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ భోపాల్ సంస్థ జాతీయ సాహిత్య పురస్కారాలు అందుకున్నట్లు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని అశోక్‌నగర్ కల్చరల్ అసోసియేషన్ భవనంలో తెలుగు సాహితీ రంగంలో నిరంతర సేవలకుగాను డా.అడువాల సుజాతకు స్త్రీమతి సతీశ్ చదుర్వేది రాష్ట్ర అలంకరణ్ తెలుగు సాహిత్య సేవలకు సి నీగేయ రచయిత డా. తిరునగరి శరత్‌చంద్ర 'సాహిత్యశ్రీ 'పురస్కారం అందుకున్నారు. మెమోంటో, శాలువాతో ఘనంగా సత్కరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె.శివారెడ్డి, అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ ఉపాధ్యక్షుడు కదారి సత్యమూర్తి, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఓరియంటల్ విభాగం డీన్ ఆచార్య రమేశ్ కుమార్ జాదవ్, ఉస్మానియా విద్యాలయ తెలుగు శాఖ ఆచార్యులు డాక్టర్ సాగి కమలాకరశర్మ, బైసా దేవదాసు, గోల్లమూడి పద్మావతి, తంగిరాల చక్రవర్తి, కోరుట్ల చెందిన కవులు వారికి అభినందనలు తెలిపారు.

'భట్టి' పాదయాత్రకు ఘన స్వాగతం


మంచిర్యాల నుంచి పాదయాత్రగా వస్తున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క


నీటి సమస్యను వివరిస్తున్న కస్తూరిబా విద్యార్థినులు

- వేలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు
- జైకాంగ్రెస్ నినాదాలతో మార్మోగిన ఎల్లంపల్లి

రామగుండం: శాసనసభా పక్ష నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర ఆదివారం రాత్రి మంచిర్యాల జిల్లా నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టు మీదుగా రామగుండం నియోజకవర్గ పరిధిలోని ఎల్లంపల్లి గ్రామానికి చేరుకుంది. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు వేలాదిగా తరలివచ్చి భట్టికి ఘన స్వాగతం పలికారు. ఆయన అడుగులో అడుగేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు వంతెన పార్టీ శ్రేణులతో జనసంద్రంగా మారింది. ఎల్లంపల్లికి చెందిన గంగపుత్రులు చేపలవలను సీఎల్పీ నేతకు బహూకరించి.. సొసైటీల్లో సభ్యత్వాల సమస్య ఉందని ఏకరువు పెట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే గంగపుత్రుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మార్గంమధ్యలో ఉన్న కస్తూర్బా విద్యాలయానికి చేరుకోగానే 9వ తరగతి విద్యార్థిని శరణ్య 'సార్ మాకు తాగునీటి సమస్య ఉంది..' అని తెలపగా సమస్యను నమోదు చేసుకున్నారు. అనంతరం ముర్మూర్ గ్రామ శివారులోని దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గదిలో బస చేసేందుకు వెళ్లారు. సీఎల్పీ వెంట కాంగ్రెస్ పార్టీ క్రియాశీలక ప్రతినిధులు, పార్టీ శ్రేణులు వేలాదిగా ఉన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయకుంటే ఉద్యమం

- టీఎస్ సీపీఎస్‌యూ నాయకుల ఆగ్రహం
- అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పణ


పింఛన్ కాన్‌స్టిట్యూషనల్ మార్చ్‌లో ఉద్యోగులు

జగిత్యాలటౌన్: ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఆకాంక్షలకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన కాంట్రిబ్యూషనరీ పింఛన్ పథకాన్ని(సీపీఎస్) వెంటనే రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలని కోరుతూ టీఎస్ సీపీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ఆందోళన చేపట్టారు. పురాతన పాఠశాల నుంచి తహసీల్ చౌరస్తా వరకు పింఛన్ కాన్‌స్టిట్యూషనల్ మార్చ్ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగ సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న కంట్రిబ్యూషనరీ పింఛన్ స్కీంతో ఉద్యోగులకు సమాజిక భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. పాత పింఛన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల హక్కులు పరిరక్షించాలి..

దూరదృష్టితో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 309ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పింఛన్ రాష్ట్ర పరిధిలోనే ఉండటం ఉద్యోగుల హక్కు అని, అలాంటి హక్కును కాలరాస్తూ ఉద్యోగుల సామాజిక భద్రతను తొలగించేలా పీఎస్ఆర్డీఏ చట్టం పరిధిలోకి తీసుకురావడం సరికాదని నాయకులు అన్నారు. ఉద్యోగుల కంట్రిబ్యూషన్ సొమ్మును షేర్ మార్కెట్‌లో పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. సీపీఎస్ విధానం ఆర్టికల్ 14కు విరుద్ధమన్నారు. ఒకేస్థాయిలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో రెండురకాల పింఛన్లు ఎందుకు అని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక భద్రతను దెబ్బతీసేలా ఉన్న చట్టాలను రద్దుచేసి మా రాష్ట్ర ప్రభుత్వం.. మాకు పాత పింఛన్ అమలు చేసేలా ప్రభుత్వం మనసు మార్చి ఉద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చేలా చూడాలని అంబేడ్కర్ విగ్రహాన్ని వేడుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు గంగుల సంతోష్, అల్లె రాజేందర్, పంచాయతీ కార్యదర్శులు కృష్ణచైతన్య, బద్రి శ్రీనివాస్, మహేశ్‌గౌడ్, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొమొరెడ్డి రామ్‌లు సేవలు మరువలేనివి


నివాళులర్పిస్తున్న జీవన్‌రెడ్డి, నాయకులు

మెట్‌పల్లి: మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు సేవలు మరువలేవని పలువురు పేర్కొన్నారు. పట్టణ శివారులోని వీఆర్ఎం గార్డెన్ ఆదివారం రామ్‌లు పెద్దకర్మ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, మధుయాష్కీ, మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మీనారాయణ, మృత్యుంజయం, రాష్ట్ర అర్థిక సంఘం చైర్మన్ రాజేశంగౌడ్ తదితరులు హాజరై నివాళులర్పించారు. అనంతరం రామ్‌లు సతీమణి జ్యోతక్క, కుమారులు కరం, విజయ్, కపిల్‌లను వారు పరామర్శించి సంతాపం తెలిపారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా రామ్‌లు నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. హైకోర్టు జడ్జి వేణుగోపాల్‌తో పాటు పలువురు న్యాయవాదులు, నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు రామ్‌లుకు నివాళులర్పించారు.

పొన్నాలతో జువ్వాడి సోదరుల భేటీ

కోరుట్ల : ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆదివారం పట్టణంలోని జువ్వాడి భవన్‌లో టీపీసీసీ నాయకుడు జువ్వాడి నర్సింగరావు, జువ్వాడి కృష్ణారావును కలిశారు. మెట్‌పల్లి పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రామ్‌లు ద్వాదశ కర్మలో పాల్గొనేందుకు వచ్చిన పొన్నాల లక్ష్మయ్య జువ్వాడి సోదరులను కలిసి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై ఆరాతీశారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఇన్‌చార్జి తాహెర్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంతం రాజం, గంగాధర్ గౌడ్, ఉన్నారు.

మహిళా సంఘం సభ్యురాలి ఆత్మహత్యాయత్నం

శంకరపట్నం(మానకొండూర్): గద్దపాకకు చెందిన మహిళా సంఘం సభ్యురాలు జంగ లక్ష్మి ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాల్లోకి వెళ్తే.. గద్దపాకలో మహిళల పొదుపు సంఘంలో సభ్యురాలైన లక్ష్మిని సంఘం నుంచి తొలగించారు. బకాయి డబ్బులు చెల్లించాలని అధ్యక్షురాలు శ్వేత, మరో పదిమంది సభ్యులు శనివారం సాయంత్రం ఒత్తిడి చేశారు. బకాయి డబ్బుల కోసం వేధింపులకు గురిచేయడం వల్లే లక్ష్మి మనస్తాపానికి గురై, క్రిమిసంహారక మందు తాగిందని బాధితురాలి భర్త జైపాల్ ఆదివారం కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. లక్ష్మి ప్రస్తుతం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

ఆర్టీసీ చెకింగ్‌స్క్వాడ్‌పై అట్రాసిటీ కేసు

గోదావరిఖని: కులంపేరుతో కించపరిచి చెకింగ్ స్క్వాడ్ ఇబ్బందులకు గురిచేశారని కరీంనగర్–2 డిపో కండక్టర్ కింసారపు కోమల ఆదివారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో కూడా రెండు, మూడు సార్లు ఇబ్బందులకు గురిచేసినట్లు కండక్టర్ వాపోయారు. సమయానికి బస్సు బస్టాండ్‌కు చేరుకున్నప్పటికీ అరగంట ముందుగా వచ్చారని బలవంతంగా రాయించుకుని సంతకం తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొంది. ఈనెల 5న కరీంనగర్ నుంచి గోదావరిఖనికి వస్తున్న క్రమంలో గోదావరిఖని బస్టాండ్ వద్ద కండక్టర్ డ్యూటీలో ఉన్న కోమల బస్సును ఆపి చెక్‌చేసి కులం పేరుతో తిట్టారని ఇచ్చిన ఫిర్యాదుతో కరీంనగర్ చెకింగ్‌స్క్వాడ్ భాస్కరాచారి, జీకేరెడ్డి, కేఆర్‌రెడ్డి, జి.లక్ష్మణ్‌పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

శంకరపట్నం(మానకొండూర్): కేశవపట్నం గ్రామానికి చెందిన చిటికెన రాజయ్య(67) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాజయ్య ఈ నెల 6న రోడ్డు దాటుతుండగా వరంగల్ వైపు నుంచి కరీంనగర్ వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో కరీంనగర్ తరలించారు. కుటుంబసభ్యులు అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ రాజయ్య ఆదివారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు సురేశ్ ఫిర్యాదు మేరకు కారును అజాగ్రత్తగా నడిపి, ప్రమాదానికి కారణమైన సాహిత్‌కుమార్‌పైకేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అంబేడ్కర్ కలల సాకారానికి కృషి


సమావేశానికి హాజరైన ఆరెసెస్ కార్యకర్తలు

సిరిసిల్లకల్చరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలు గన్న సమరసతా సమాజం కోసం ఆర్ఎస్ఎస్ కృషి చేస్తోందని ఆ సంస్థ ప్రాంత సహ కార్యవాహ ఉప్పలంచ మల్లికార్జున్ స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అంబేడ్కర్ జయంతి వారోత్సవాల సందర్భంగా సమరసత సంచలన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రధాన వీధుల్లో సంఘ్ కార్యకర్తలు రూట్ మార్చ్ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రధాన వక్తగా హాజరైన ఆయన మాట్లాడారు. ఎందరో మహాపురుషులకు జన్మనిచ్చిన దేశం ప్రాచీన సాంస్కృతిక వారసత్వం కలిగి ఉందని, ఆది శంకరాచార్యులు, రామానుజులు, బసవేశ్వరులు వంటి మహనీయులు జాతి ఐక్యత కోసం శ్రమించారన్నారు. హిందూ సమాజాన్ని ప్రేమించి లోపాల సవరణకు ఉద్యమించిన అంబేడ్కర్‌ను గొప్ప వ్యక్తిగా కీర్తించారు. అంబేడ్కర్ కృషిని గుర్తించిన దేశం ఆయన జయంతిని ఘనంగా నిర్వహిస్తోందన్నారు. జాతి సంఘటన కోసం పనిచేస్తున్న ఆర్ఎస్ఎస్ తో అంబేడ్కర్ సత్సంబంధాలు కలిగి ఉన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా సంఘ్ చాలక్ డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, సహ సంఘ్‌చాలక్ ఎలగందుల సత్యనారాయణ, పబ్బ నాగరాజు, జిల్లా కార్యవాహ కొండేటి బాలరాజు, దేవేంద్ర గోనె భూమయ్య, రాజశేఖర్ సుమారు 450 మంది ఆరెఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను వినియోగించొద్దు


ప్లాస్టిక్ వ్యర్థాలను పరిశీలిస్తున్న గోపాల్‌రావు

ముస్తాబాద్ (సిరిసిల్ల): ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్ రావు అన్నారు. మోహినికుంటలోని బుడగజంగాల కాలనీలో ఆదివారం ప్లాస్టిక్, వ్యర్థ పదార్థాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ సంచులు, కవర్లను వినియోగించవద్దని సూచించారు. వ్యాధులబారిన పడకుండా ఉండేందుకే ప్లాస్టిక్‌ను నిషేధించినట్లు తెలిపారు.

ఉరేసుకొని యువతి ఆత్మహత్య


అనన్య (ఫైల్)

జగిత్యాల క్రైం: జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్‌కు చెందిన గన్న అనన్య (18) హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్‌లో శనివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన గన్న అనన్య తండ్రి ధర్మరాజు నాలుగేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకోగా తల్లి జమున మిర్యాలగూడకు చెందిన వ్యక్తిని వివాహం చేసుకొని హైదరాబాద్‌లో ఉంటోంది. శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా అనన్యది ఆత్మహత్య కాదని, తండ్రి బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

గోదావరిలో నీటమునిగి బాలుడి మృతి


కార్తీక్ మృతదేహం

ధర్మపురి : గోదావరిలో నీటమునిగి బాలుడు మృతిచెందిన సంఘటన ధర్మపురిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. నిజామాబాద్ జిల్లా బోధన్ మండంలోని ఆమ్దాపూర్ గ్రామానికి చెందిన చెన్నూరి సురేందర్ – సోనీ దంపతులకు చరణ్, కార్తీక్ (13) ఉన్నారు. దైవ దర్శనం కోసం ధర్మపురి, కొండగట్టు, వేములవాడ పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు శనివారం బోధన్ నుంచి తల్లి సోనీ అనుమతితో చిన్న కుమారుడు కార్తీక్ వరుసకు పెద్దమ్మ అయ్యే మామిడి రేణుకతో వచ్చాడు. మొత్తం ఎనిమిది మంది కారులో వచ్చి ధర్మపురిలో సాయంత్రం నిద్రించారు. ఆదివారం ఉదయం గోదావరిలో స్నానాలు చేసేందుకు సత్యవతి గుండంలోకి వెళ్లారు. లోతుగా ఉండడంతో కార్తీక్ నీటిలో మునిగిపోయాడు. దీంతో వారంతా కేకలు వేయడంతో భక్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బాలుడిని జాలర్ల సాయంతో బయటకు తీయగా అప్పటికే మృతిచెందాడు. కార్తీక్ బోధన్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. కొడుకు మృతివార్తను తల్లి సోనీకి తెలుపగా ధర్మపురికి చేరుకుంది.

నాడు తండ్రి.. నేడు కొడుకు..

కార్తీక్ తండ్రి సురేందర్ 2014లో చెరువులో మునిగి మృతిచెందాడు. నేడు కుమారుడు కార్తీక్ గోదావరిలో మునిగి మృతిచెందడంతో విషాదం నెలకొంది. సోనీ బీడీలు చుడుతూ ఇద్దరు కుమారులను చదివిస్తోంది. సోనీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.